సాక్షి బాపట్ల

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



బగళాముఖి సేవలో జిల్లా జడ్జి

పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖ అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని గుంటూరు జిల్లా జడ్జి చింతాడ రాజగోపాల్ శనివారం దర్శించుకున్నారు.



తిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు

దాచేపల్లి: శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి జ్యోతి ఊరేగింపు శనివారం నిర్వహించారు. మాలధారులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.



కొవ్వొత్తులతో ప్రదక్షిణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై కొలువై ఉన్న కార్మెల్‌మాతను పదోతరగతి విద్యార్థులు శనివారం సందర్శించారు. కొవ్వొత్తులతో ప్రదక్షిణ చేశారు.

న్యూస్‌రీల్

ఖేలో ఇండియా విజేతకు స్పాన్సర్‌షిప్

- వెయిట్ లిఫ్టర్ ప్రేమసాగర్‌కు రూ. 30 లక్షల స్పాన్సర్‌షిప్
- ఐదేళ్లపాటు అందించనున్న రాధే గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్



అగ్రిమెంట్ అందజేస్తున్న సంస్థ చైర్మన్ ప్రసాదరావు

చీరాల రూరల్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ అందుకున్న చీరాల వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు దేవరకొండ ప్రేమసాగర్‌కు అరుదైన అవకాశం దక్కింది. రాధే గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్ ఆపన్నహస్తం అందించింది. గ్రూప్ చైర్మన్ దగ్గుమళ్ల ప్రసాదరావు, మేనేజింగ్ డైరెక్టర్ రాధే ప్రేమసాగర్‌కు ఐదేళ్లపాటు స్పాన్సర్‌షిప్ అందిస్తూ శనివారం అగ్రిమెంట్ చేసుకున్నట్లు ప్రేమసాగర్ తండ్రి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం ప్రేమసాగర్‌కు అవసరమైన క్రీడా పరికరాల కొనుగోలు, ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలు, విదేశాలలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ప్రయాణ ఖర్చులు, భోజనం, వసతి ఖర్చులు ఏడాదికి రూ. 5 లక్షలు, ఐదేళ్లకు రూ. 30 లక్షల వరకు ఖర్చు చేయనున్నట్లు ఆయన చెప్పారు. కోస్తా గిరిజన అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ దేవరకొండ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర సెక్రటరీ మల్లి అజయ్‌బాబు, గిరిజన విద్యార్థి రాష్ట్ర చైర్మన్, ప్రొఫెసర్ మల్లిభాస్కర్, ఏపీ గిరిజన ఎంప్లాయీస్ అసోసియేషన్ రైల్వే మల్లిభాస్కరరావులు వెయిట్‌లిఫ్టర్ ప్రేమసాగర్‌ను అభినందించి, రాధే గ్రూప్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

కొండవీడు సంబరం ఆరంభం

- ఉత్సవాలు చరిత్రను చాటే వారధి కావాలి
- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఆకట్టుకున్న హెలిరైడ్
- తొలి రోజు భారీగా వచ్చిన పర్యాటకులు



ఫ్లవర్ స్టాల్ వద్ద జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

యడ్లపాడు: కొండవీడు సంబరాలు అంబరాన్నంటాయి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రకృతి అందాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొండవీడు ఫెస్ట్-2024 నిర్వహిస్తోంది. పకడ్బందీగా ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా హాజరైన జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ గొప్ప వారసత్వ సంపదను భావితరాలకు అందించే వారధి కొండవీడు ఫెస్ట్-2024 కావాలని ఆకాంక్షించారు. తొలుత జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్‌ఓ ఎన్.రామచంద్రారావు, టూరిజం జిల్లా అధికారి బీజే బెన్నీ ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొని బెలూన్లు ఎగరేసి ఉత్సవాలను ప్రారంభించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాం ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, మరో ఇద్దరు జాయింట్ కలెక్టర్లతో కలసి రెండు కొత్త పుస్తకాలను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన 6 విభాగాల స్టాల్స్‌తో పాటు హెలిరైడ్‌ను లాంఛనంగా జేసీ ప్రారంభించారు. ప్రారంభోత్సవ సందర్భంగా ఉదయం, సాయంత్రం నిర్వహించిన సమావేశాల్లో కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, జేసీ, ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు ప్రసంగించారు.



ఉత్సవాల ప్రారంభ సూచికగా బెలూన్లు ఎగరేస్తున్న జేసీ

కొండవీడు ప్రాశస్త్యం, వందేళ్లకు పైగా పరిపాలించిన అద్దంకి రెడ్డిరాజుల పాలనా వైభవాలను ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఉత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇక్కడ సుందరమైన ఘాట్‌రోడ్డు, పురాతన కట్టడాలు, ప్రాచీన దేవాలయాలు, విలువైన, అరుదైన ఔషధ వృక్షాలు అనేకం ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోనే కొండవీడు గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు నగర వనానికి ఖర్చు చేస్తోందని చెప్పారు. ఆయా నిధులతో ఇప్పటికే సందర్శకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను, పలు సాహస క్రీడలు, వారసత్వ సంపద, రక్షణ, నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఉత్సవాలలో ప్రత్యేకతలిలా...

కొండవీడు ఉత్సవాలలో హెలిరైడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలు, పెద్దలు కోట అందాలను ఆకాశం నుంచి వీక్షించేందుకు ఆసక్తి చూపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. స్వాగత ద్వారం, నెమళ్లు, ఏనుగులు, కొంగలు, ఎద్దుల బండి, సైకిల్, కోనేరు నర్సరీ వంటి వాటిని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. తీర్చిదిద్దారు. పొదు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టులు వెరైటీ వంటకాలతో భోజన ప్రియులను స్వాగతించాయి.

కళాకారులు, రచయితలు సందడి

స్కూలు పిల్లలు, కళాశాలలు, కళాకారులు, జబర్దస్త్ టీం, పలువురు నాటకాల రచయితలు, ఉద్యోగులు ఆలపించిన ప్రత్యేక పాటలు, పద్యాలు, నృత్యాలు సందడి చేశాయి. కొండవీడు రాజ్యం, ఖిల్లా నమూనా సైకత శిల్పం చూపరుల మనసుల్ని ఇట్టే కట్టిపడేసింది. చారిత్రక అంశాలు తెలిపే గ్యాలరీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంపింగ్ తదితర ఆట వస్తువులు పిల్లలను ఆకట్టుకున్నాయి. వెదుళ్ల చెరువులో కయాకింగ్, పెడల్ బోటింగ్ వద్ద యువత బారులు తీరింది. మసీదు సమీపంలో ఆర్చరీ, గన్ షూటింగ్, తారాబురుజు వద్ద ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ వంటి సాహస క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొని సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఘాట్‌రోడ్డు ప్రారంభంలోనూ కొండపైన ప్రత్యేక వైద్య శిబిరాలను వైద్యశాఖ ఏర్పాటు చేసింది.

ప్రవేశం ఉచితం

యడ్లపాడు: కొండవీడు ఉత్సవాలకు వచ్చే సందర్శకుల నిమిత్తం చెక్‌పోస్టు వద్ద ప్రవేశ రుసుం ఎత్తివేస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు.

హెలిరైడ్ బుకింగ్ ఇలా..

నరసరావుపేట: కొండవీడు ఫెస్ట్‌లో హెలిరైడ్‌కు సంబంధించి బుకింగ్ చేసుకునేందుకు మహేష్ 94003 99999, 74834 32752 నంబర్లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెలిరైడ్ ట్రిప్‌కు పెద్దలకు రూ.4,500 పిల్లలకు రూ.4000 ఉండగా వాటిని తగ్గిస్తూ పెద్దలకు రూ.3,800 పిల్లలకు రూ.3,500గా ఖరారు చేశారు.

జెడ్పీ నిధులు మంజూరు

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా కొండవీడుకోటలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కొండవీడు ఫెస్ట్-2024కు జెడ్పీ నిధుల నుంచి రూ.ఏడు లక్షలు అందించినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. ఆమె శనివారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. కోట అభివృద్ధి కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు నిధులు కేటాయించినట్లు చెప్పారు.

మరియమాత దర్శనం.. సర్వపాప హరణం



ప్రార్థనలు చేస్తున్న బిషప్ విజయ్ కుమార్, బిషప్ రాజారావు తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): అమ్మా దర్శనం.. మరియమ్మా దర్శనం.. అంటూ భక్తుల శరణు ఘోషతో మేరీమాత పుణ్యక్షేత్రం మారుమోగింది. గుణదల క్షేత్రంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు అనేక రాష్ట్రాల నుంచి క్రీస్తు విశ్వాసులు లక్షలాదిగా తరలి వస్తున్నారు. ఏ దిక్కున చూసినా మరియమాత భక్తులే కనిపిస్తున్నారు. గుణదల మరియమాత ఉత్సవాల రెండో రోజైన శనివారం బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో జరిగిన సమష్టి దివ్యబలి పూజకు శ్రీకాకుళం మేత్రాసన బిషప్ రాయరాల విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. లోక రక్షకుడైన ఏసు క్రీస్తును ఈ లోకానికి అందించిన మరియమాత పరమ పవిత్రురాలని కొనియాడారు. ఆమె పవిత్రతకు మెచ్చి సాక్షాత్తూ దేవాది దేవుడే మానవ రూపంలో జన్మించారని పేర్కొన్నారు. ఏసు నామంలో జీవిస్తున్న మనం మరియతల్లిని ఎల్లప్పుడూ మననం చేసుకోవాలని సూచించారు.

అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ ఫాదర్ సునీల్‌రాజు తదితర గురువులు, మఠకన్యలు, వేలాది మంది విశ్వాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని పల్నాడు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి శనివారం తెలిపారు. ఆదివారం నుంచి 20వ తేదీ వరకు పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్స్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు నియమించిందని వివరించారు. పరీక్ష కేంద్రాలలో ఏవైనా సమస్యలు తలెత్తితే కంట్రోల్‌రూమ్ 08647 223355కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఆటోలోనే ఇంటి పట్టా రిజిస్ట్రేషన్

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు అందించిన సచివాలయ సిబ్బంది



భట్టిప్రోలు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను గ్రామ సచివాలయానికి తీసుకురాగా సిబ్బంది స్వయంగా ఆమె వద్దకు వెళ్లి ఇళ్ల పట్టా రిజిస్ట్రేషన్ చేశారు. వివరాల్లోకి వెళితే భట్టిప్రోలుకు చెందిన గుంజా తిరుపతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంచంలో ఉంది. శనివారం ఆమెను కుటుంబ సభ్యులు ఆటోలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమె వేలిముద్రను తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి పంపారు. రిజిస్ట్రేషన్ చేసిన భట్టిప్రోలు, పెదపులివర్రు వీఆర్‌ఓలు శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు, సచివాలయ సెక్రటరీ కోట వెంకటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ ఆర్.వెంకటేశ్వరరావులకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అక్కడికక్కడే మృతి



కారులోనే మృతి చెందిన శ్రావణ్‌కుమార్ రెడ్డి

అద్దంకి: ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతిచెందాడు. ఈ ఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిలోని శింగరకొండ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. అందిన సమాచారం మేరకు నెల్లూరు జిల్లా జలదంకికి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి (35) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం శ్రావణ్‌కుమార్‌రెడ్డి కారులో ఒక్కడే తన తల్లిని హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు బయలుదేరాడు. కారు అద్దంకి సమీపంలోకి రాగానే మంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రావణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి ఇస్క సుశీలమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదు. మృతదేహాన్ని అద్దంకి వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

14న వైఎస్సార్ సీపీ బహిరంగ సభ

లోక్‌సభ సమన్వయకర్త అనిల్ కుమార్‌యాదవ్ రాక

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ లోక్‌సభ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ నెల 14న రాకను పురస్కరించుకొని పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా బీసీలకు కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఏడు నియోజకవర్గాలకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, చిలకలూరిపేట సమన్వయకర్త కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు.

జానపదాలు సమాజ హితాలు

● సాహితీ విశ్లేషకుడు వెంకట్రావు
● జానపదాలు – జ్ఞానపదాలు గ్రంథం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఫణీంద్రబాబు

అద్దంకి: జానపదాలు సమాజహితాలని సాహితీ విశ్లేషకుడు అన్నంనేని వెంకట్రావు అన్నారు. పట్టణంలోని గీతామందిరంలో శనివారం విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన 'జానపదాలు – జ్ఞానపదాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈసభలో జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి సభాహ్వానం పలికారు. సభకు రిటైర్డ్ ఆర్జేడీ యు.దేవపాలన అధ్యక్షత వహించారు. డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు పుస్తకాన్ని ఆవిష్కరించగా, రిటైర్డ్ అధ్యాపకుడు గోరంట్ల లక్ష్మీనారాయణ పుస్తకాన్ని స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాహితీ విశ్లేషకుడు అన్నంనేని వెంకట్రావు గ్రంథ సమీక్ష చేస్తూ విద్వాన్ జ్యోతి చంద్రమౌళి ఇప్పటికి 25 గ్రంథాలను రచించారని గుర్తు చేశారు. వాటిలో జానపదాలపై ఇది రెండో పుస్తకం అని చెప్పారు. ఈయన రచించిన పుస్తకాలపై ఇద్దరు పీహెచ్‌డీలు, ఒకరు ఎంఫిల్ చేశారన్నారు. 'జానపదాలు–జ్ఞానపదాలు' పుస్తకంలో తోలు బొమ్మలాట, వీధి భాగవతులు, మాతంగులు, గంగిరెద్దుల వారు, గారడీ, చెక్క భజన, కోలాటం వంటి ఎన్నో జానపదాల గురించి, వాటిని ప్రదర్శించే వారి గురించి సవివరంగా వివరించారన్నారు. మరో సాహితీ విశ్లేషకుడు గాడేపల్లి దివాకరదత్తు మాట్లాడారు. సాహితీవేత్తలు చెన్నుపాటి రామాంజనేయులు, ఇతర వక్తలు పుస్తకాన్ని పరిచయం చేశారు. అనంతరం గ్రంథకర్తను సాహితీవేత్తలు ఘనంగా సన్మానించారు. వారణాశి రఘురామశర్మ, ధర్వరపు శ్రావణ్‌కుమార్, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, చెన్నుపల్లి నాగేశ్వరరావు, మస్తాన్, మన్నం త్రిమూర్తులు, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ కృషి

ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కరణం బలరాం, సమన్వయకర్త వెంకటేష్



డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం, సమన్వయకర్త వెంకటేష్

చీరాల టౌన్: మహిళల అభ్యున్నతికి, ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని, మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్ మేలును మరువకుండా మళ్లీ సీఎంగా గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఈపురుపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం జిల్లాలోనే పెద్ద పండుగలా జరిగింది. చీరాల మండలంలోని 15 పంచాయతీల్లో 1565 పొదుపు గ్రూపు మహిళలు అధికసంఖ్యలో పాల్గొని సీఎం జగనన్నకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సీఎం జగన్ మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం గతంలో ఎవరూ చేయని విధంగా గొప్ప పథకాలు అందించారన్నారు. జిల్లా చరిత్రలో మండలంలోని 1565 గ్రూపులకు రూ.1369 కోట్లు ఆసరా నిధులు జమ చేయడం నియోజకవర్గానికే గర్వకారణమన్నారు.

జగనన్నకు అండగా ఉండాలి..
నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ గతంలో ఏ పాలకులు చేయలేని విధంగా మహిళల కోసం బృహత్తర పథకాలు రచించి పక్కాగా అమలు చేస్తూ ప్రతి మహిళకు అన్నగా, తమ్ముడిగా, పెద్ద కొడుకుగా ఉన్న సీఎం జగనన్నకు అండగా నిలిచే సమయం ఆసన్నమైందన్నారు. ప్రతిపక్ష పార్టీల ఊహకు అందనివిధంగా అత్యధిక మెజార్టీతో మళ్లీ సీఎంగా జగనన్నకు, చీరాల ఎమ్మెల్యేగా తనకు అండగా నిలవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, వెంకటేష్‌లు ఆసరా చెక్కును పొదుపు గ్రూపు మహిళలకు అందించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎంపీడీఓ శోభారాణి, ఏపీఎం సుబ్బారావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, వైద్యులు గుంటుపల్లి హైమా సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు అంకాళరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పొత్తులు ఎన్నిఉన్నా గెలిచేది జగనన్నే

● వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
● 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరిక


కొమ్మాలపాడులో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరిన నాయకులతో చినహనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నిపార్టీలు కలసి వచ్చినా గెలిచేది మాత్రం వైఎస్సార్ సీపీనేని.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రమాణ స్వీకారం చేస్తారని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. సంతమాగులూరు మండలంలో టీడీపీకి భారీషాక్ తగిలింది. మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో శనివారం 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి సమన్వయకర్త చిన హనిమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వీరంతా గ్రామ సర్పంచ్ మోతాద్ ఖాదర్ మస్తాన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అడ్రస్ నియోజకవర్గంలో గల్లంతు అవుతుందన్నారు.


కొరిశపాడు మండలంలో..
మేదరమెట్ల: కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన పది కుటుంబాలవారు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈసందర్భంగా పార్టీ కండువాలను కప్పి చిన హనిమిరెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. దంతాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో పాలపర్తి సరేంద్ర, ముప్పవరపు కిరణ్ రాజు, రేవూరి దానియేలు, ఉసురుమాటి కనకయ్య తదితరులు ఉన్నారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రాధాన్యం



వేటపాలెం: సముద్రతీరం వెంట మడ అడవుల పెంపకంతో పాటు సముద్ర తాబేళ్ల రక్షణ జీవవైవిధ్య పరిరక్షణకు రెండు కళ్లలాంటివని ట్రీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సుప్రజా ధరణి పేర్కొన్నారు. స్థానిక సముద్ర తాబేళ్ల సంరక్షణ కార్యాలయం వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సముద్ర తాబేళ్ల సంరక్షణ దళ సభ్యులకు శనివారం శిక్షణ నిర్వహించారు. మడ మొక్కలు మత్స్యకారుల జీవనోపాధికి దోహదపడతాయని తెలిపారు. ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ పి.సందీప్ సముద్ర తాబేళ్లు గుడ్లు పెట్టిన దగ్గరనుంచి వాటిని సంరక్షించి, ఆ పిల్లలను తిరిగి సముద్రంలోకి సురక్షితంగా వదలడం ఎలా అనే అంశాలపై మెలకువలు వివరించారు. అటవీశాఖ అధికారి జాన్సన్, బీట్ అధికారి శిరీష, మెరైన్ కానిస్టేబుల్ ప్రసాద్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ సందీప్, శవనం చంద్రారెడ్డి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఈపురుపాలెం విద్యార్థిని



చీరాల రూరల్: అథ్లెటిక్స్ విభాగంలో జాతీయస్థాయి హై జంప్ పోటీలకు ఈపురుపాలెంకు చెందిన విద్యార్థిని కొండేపి దుర్గా భవాని ఎంపికయ్యింది. ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దుర్గాభవాని ఇటీవల కడవకుదురులో జరిగిన క్రీడా సెలక్షన్స్‌లో అండర్–16 బాలికల హైజంప్‌లో పాల్గొంది. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన దుర్గా భవానిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు గుజరాత్ రాష్ట్రంలో జరగబోయే 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్ (ఎన్ఐడీజేఏఎం)కి ఎంపికైంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన దుర్గా భవానిని పాఠశాల హెచ్ఎం కె.హనోర, డీఎస్ రోజ్ హెల్మా, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని నల్లపాడు పోలీసు స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాంబాబు కథనం ప్రకారం నగర శివారులోని ఎన్‌హెచ్–16 బుడంపాడుహైవే సమీపంలో అక్రమంగా మహారాష్ట్రకు చెందిన లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. లారీలో అక్రమంగా తరలిస్తున్న 834 బస్తాలు (రూ. 8.50 లక్షల విలువ కలిగినవి) స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తాళ్లూరి సీతయ్యతోపాటు, మరో ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు.